క్లుప్తంగా

వైఎస్సార్ ఆసరా లబ్ధి రూ.40.68 కోట్లు

రేగిడి: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మండలంలోని లబ్ధిదారులకు రూ.40.68 కోట్లు అందించడం జరిగిందని ఏపీఎం పి.గోవిందరావు తెలిపారు. మండలంలోని ఆమదాలవలస, రేగిడి గ్రామ సచివాలయాల్లో పథకం లబ్ధిదారుల జాబితా వివరాలు వచ్చాయని, ఒకసారి పేర్లు చూసుకోవాలని గ్రామైక్య సంఘాల సభ్యులకు తెలిపారు. మండలంలోని 1,399 సంఘాల సభ్యులకు సంబంధించి, నాలుగు విడతల్లో ఈ మొత్తాన్ని జమ చేయడం జరిగిందన్నారు. ఈ నెల 23వ తేదీన నాలుగో విడత నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నామన్నారు.

13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

రేగిడి: మండలంలో ఇప్పటివరకు 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని ఏవో మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని దేవుదళ, గోపింపేట, చిన్నపుర్లి, కొమెర గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆయన రైతుల ధాన్యం విక్రయాలపై ఆరాతీశారు. ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపు జరుగుతుందని ఆయన తెలిపారు.

ఘనంగా విగ్రహ ఊరేగింపు



ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

బొబ్బిలి: స్థానిక తారకరామా కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం మంగళవారం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా పల్లకీలో ఉత్సవ విగ్రహాన్ని వీధుల్లో ఘనంగా ఊరేగించారు. అనంతరం భక్తులకు శ్రీరామ అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో బలిజేపల్లి రామజోగారావు, కౌన్సిలర్ వాడపల్లి వనజా మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి..

బాడంగి: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుందని డొంకినవలస ఎస్‌పీఎం బి.సతీష్‌కుమార్, గ్రామీణ తపాలా శాఖ యూనియన్ ఆలిండియా ప్రత్యేక ఆహ్వానితులు ఆర్.హేమలత అన్నారు. మండలంలోని డొంకినవలస సబ్‌పోస్టాఫీసులో పాల్తేరు సహాయ పోస్ట్‌మాస్టర్‌గా పదవీ విరమణ చేసిన వంగపండు శ్రీరాములు దంపతులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు శ్రీరాములు సేవలను కొనియాడారు. ఆయన విధిని ఆయన ఎప్పుడూ సక్రమంగా నిర్వర్తించేవారని, ఓ మంచి ఉద్యోగిగా గుర్తింపు పొందారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని, మిగతా ఉద్యోగులు కూడా మంచి ఉద్యోగులుగా గుర్తింపు పొందాలని కోరారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు

రామభద్రపురం: అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం పురస్కరించుకుని, మండలంలోని బూసాయవలస, ముచ్చెర్లవలస గ్రామాల్లో అక్షింతలు పంచిపెట్టారు. దేశంలోని భక్తులందరికీ ఈ కార్యక్రమానికి ప్రాతినిధ్యం కల్పించేలా అక్షింతల పంపిణీ చేపట్టినట్లు వేంకటేశ్వరాలయ ధర్మకర్త కోరాడ మహేష్, బూసాయవలస ఉప సర్పంచ్ రౌతు వెంకటలక్ష్మి తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన మూతి సోములు అదృశ్యంపై మంగళవారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వై.రవికిరణ్ అన్నారు. వివరాలిలా ఉన్నాయి.. 2023 డిసెంబర్ 29వ తేదీ రాత్రి బాగా మద్యం తాగి ఇంటికి వచ్చిన సోములను భార్య గౌరమ్మ ఇలా తాగివస్తే ఎలా అని అడగ్గా, వారి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. మరుసటిరోజు ఉదయం బహిర్భూమికి అని చెప్పి, ఆయన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆరు నెలల క్రితం కూడా ఇలాగే ఇంటి నుంచి బయటకు వెళ్లి మూడు రోజుల తర్వాత వచ్చాడు. ఎప్పటిలాగే వచ్చేస్తాడని అనుకున్న కుటుంబీకులు ఆయన ఎప్పటికీ రాకపోవడంతో ఆందోళన చెంది, అన్నిచోట్లా వెతికారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించి, ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్ సీపీ ప్రభంజనాన్ని ఎవరూ అడ్డుకోలేరు..

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



రామభద్రపురం: పార్టీ మండల కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: ఎన్ని పార్టీలు ఏకమైనా, ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమని, దానిని ఎవరూ అడ్డుకోలేరని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతితో కలిసి మంగళవారం పార్టీ మండల కార్యవర్గ సభ్యులతో సమావేశమైన ఎమ్మెల్యే 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. జగన్‌మోహన్ రెడ్డిని నమ్మిన ప్రజలు 2019 ఎన్నికల్లో 51 శాతం ఓట్లతో 151 ఎమ్మెల్యే సీట్లు ఇచ్చి, చరిత్రాత్మక విజయం చేకూర్చారని, అప్పట్లో అధికార టీడీపీని 23 సీట్లకే పరిమితం చేసి, చిత్తుచిత్తుగా ఓడించారన్నారు. తనపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేడు ఎన్నికల మేనిఫెస్టోలోని 99.5 శాతం హామీలు నెరవేర్చిన నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో కనీవినీ ఎరుగని రీతిలో 175కి 175 ఎమ్మెల్యే సీట్లతో ప్రజలు తిరుగులేని ఘనవిజయాన్ని అందిస్తారని తెలిపారు. టీడీపీ పాలనకు భిన్నంగా సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేసి, అవినీతి లేని పాలన కొనసాగించిన ప్రభుత్వం మనదన్నారు. ప్రభుత్వం కూడా ప్రజలకు మంచి జరిగిందంటేనే ఓటు వేయండి అని కోరుతోందని, ఇలా అడిగే దమ్మున్న పార్టీని గానీ ప్రభుత్వాన్ని గానీ తాను ఎన్నడూ చూడలేదన్నారు. టీడీపీకి అధికారమిస్తే ఇప్పుడున్న సంక్షేమ పథకాలు ఏవీ ఉండవని, మళ్లీ అవినీతి రాజ్యమేలుతుందన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు.

రాచరిక పాలన వద్దు..

ప్రజల కష్టాలు తెలియని రాచరిక పాలనకు అవకాశం ఇవ్వవద్దని ఎమ్మెల్యే శంబంగి అన్నారు. అధికారంలో ఉండి, మంత్రి పదవిలో ఉండి కూడా కనీస అభివృద్ధి చేయని రాజులను గ్రామాల్లోకి రానివ్వకూడదన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్‌లు టీడీపీలో చేరిపోతారు.. చేరిపోతున్నారని మైండ్‌గేమ్ ఆడుతున్నారని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. మునిగిపోయే నావ ఎక్కడానికి ఎవరూ ఇష్టపడరన్నారు. ఇప్పటికే ఎక్కినవారు మునిగిపోక తప్పదన్నారు. గతంలో 8 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొందానని, రానున్న ఎన్నికల్లోనూ 15 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ గెలుపు కోసం కార్యకర్తలంతా పట్టుదలతో శక్తివంచన లేకుండా సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మేంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పార్టీ మండల ఉపాధ్యక్షులు కటికి చిన్నారావు, దర్రు పైడిరాజు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు అధ్యక్షతన జరిగిన పార్టీ నూతన మండల కమిటీ సభ్యుల సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించాలని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతీ ఇంటికి మేలు జరిగిందని, ఇదే విషయాన్ని లబ్ధిదారుల వద్దకు వెళ్లి తెలపాలన్నారు. అలాగే టీడీపీ హయాంలో ప్రజలు ఏ మేర నష్టపోయారో మరోసారి గుర్తు చేయాలన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా ఐకమత్యంతో ఉండి, పార్టీ విజయం కోసం పాటుపడాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, వైస్ ఎంపీపీ బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: స్థానిక ఎంపీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కొత్తగా ఎంపికైన పార్టీ మండల కమిటీ సభ్యుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు తొలుత వారికి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పలు సూచనలు, సలహాలు చేశారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో బొబ్బిలి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి నూతనంగా ఎన్నికైన మండల కమిటీలోని ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. మండల కమిటీల్లో వివిధ హోదాల్లో ఉన్న నాయకులంతా పార్టీ విజయానికి అహర్నిశలు కష్టపడి పనిచేయాలన్నారు. మండలానికి సంబంధించి, పార్టీకి చెందిన అన్నివర్గాల నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకుని వెళ్లాలన్నారు. సమావేశంలో ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, వైస్ ఎంపీపీ, జేసీఎస్ మండల కన్వీనర్ చేపేన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ మండల, పట్టణ నూతన కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీ సీనియర్ నేత శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు చోడిగం జి రమేష్‌నాయుడు, ఉత్తరావిల్లి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాలకు అండగా ప్రభుత్వం



నాయీబ్రాహ్మణులకు గుర్తింపుకార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: రాష్ట్రంలోని అన్నివర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక నిర్ణయాలతో బడుగు,బలహీన వర్గాల ఆర్థిక బలోపేతానికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన నాయీబ్రాహ్మణ సంగీత వాయిద్య కళాకారులకు గుర్తింపుకార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాయీబ్రాహ్మణలకు ఓ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వారికి ఆర్థిక చేయూత కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీరి కోసం ప్రత్యేకంగా గుర్తింపుకార్డులు తీసుకువచ్చామని, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలోని 1200 మందికి కార్పొరేషన్ ద్వారా కార్డులు ఇస్తున్నామన్నారు. ఈ కార్డులు ఉంటే రాత్రి ప్రయాణాల్లో పోలీసులు, ఇతర రోడ్డు రవాణా అధికారులు అభ్యంతరాలు తెలపరన్నారు. అలాగే ఈ కార్డుల ద్వారా భవిష్యత్ బీమా, పింఛన్ సదుపాయం వంటివి కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర నాయకుడు ముంగటి సూర్యనారాయణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ముంగటి రమణ, వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాజాం అధ్యక్షుడు పసుపురెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శిపై ఫిర్యాదు



సచివాలయ కార్యదర్శి తీరుపై ఎమ్మెల్యే శంబంగికి ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ కుమారి

రామభద్రపురం: మండలంలోని రావివలస గ్రామ సచివాలయ కార్యదర్శి శ్రీనివాస్‌పై ఆ గ్రామ సర్పంచ్ సోముల కుమారి, ఆమె భర్త రాజు కలిసి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుకు ఫిర్యాదు చేశారు. పార్టీ కార్యక్రమం నిమిత్తం స్థానికంగా ఉన్న పార్టీ మండల కార్యాలయానికి మంగళవారం విచ్చేసిన వారు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు తీసుకువచ్చారు. సదరు కార్యదర్శి సక్రమంగా సచివాలయానికి రావడం లేదని, వచ్చినా సమయపాలన పాటించడం లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సచివాలయ పరిధిలో ఏ ప్రభుత్వ కార్యక్రమం జరిగినా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను తామే పిలుచుకునే పరిస్థితి ఉందన్నారు. సచివాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం జరుగుతున్నా బిల్లులు పెట్టేందుకు ఆటంకం కలిగిస్తున్నారని తెలిపారు. తాను గిరిజన మహిళా సర్పంచ్‌నని చిన్నచూపు చూస్తూ కనీసం విలువ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మా గిరిజన సమస్యలు పరిష్కరించే కార్యదర్శిని నియమించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సదరు కార్యదర్శితో మాట్లాడి, ఇబ్బంది లేకుండా చూస్తానని హామీఇచ్చారు.

కొత్త పెన్షన్ల జాబితా పరిశీలన



కొత్త పెన్షన్ల జాబితాను పరిశీలిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, పక్కనే ఎంపీడీవో రమామణి

రామభద్రపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమామణితో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు మంగళవారం సమావేశమై, కొత్త పెన్షన్ల జాబితాను పరిశీలించారు. ఎంతమందికి కొత్తగా పింఛన్ మంజూరైంది.. ఈ నెల పింఛన్ ఎంత మొత్తంలో ఉంది.. కొత్త, పెంచిన పింఛన్ల పంపిణీ వంటి తదితర అంశాలపై ఎంపీపీ చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో 9,049 మంది లబ్ధిదారులకు రూ.88,77,92,250లను వలంటీర్లు నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి, అందజేశారని తెలిపారు. ఈ నెలలో 7,811 పాతవారు, 126 మంది కొత్త వారికి మొత్తం రూ.237 కోట్లు నేరుగా వలంటీర్ల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇకనుంచి ఒక్కో లబ్ధిదారునికి నెలకు రూ.3 వేల చొప్పున ప్రభుత్వం పింఛన్ అందిస్తుందన్నారు.

క్యాలెండర్‌ల ఆవిష్కరణ



రేగిడి: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్



రాజాంలో సహకార బ్యాంక్ క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగులు



బొబ్బిలి: యూటీఎఫ్ క్యాలెండర్‌తో ఎమ్మెల్యే శంబంగి

రేగిడి: మండల కేంద్రంలో పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ చేతులమీదుగా మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఉపాధ్యాయ సంఘ నేతలు, ఉద్యోగులకు కొత్త క్యాలెండర్లు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రేగిడి శాఖ నాయకుడు పాలూరి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జిల్లా సహకార బ్యాంక్ నూతన సంవత్సర క్యాలెండర్లను ఎమ్మెల్యే కంబాల జోగులు మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కో–ఆపరేటివ్ బ్యాంకులు రైతులకు అండగా ఉంటున్నాయని, ఈ సహకార బ్యాంకులు, సంఘాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో బలోపేతం చేశారన్నారు. కార్యక్రమంలో శివ్వాం పీఏసీఎస్ చైర్‌పర్సన్ మరిశర్ల విజయలక్ష్మి, పార్టీ రాజాం యువజన విభాగం అధ్యక్షులు వంజరాపు విజయ్‌కుమార్, పాలవలస గోపి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయగౌరి, జిల్లా నాయకులు ప్రసన్నకుమార్, శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేయాలి

రాజాం సిటీ: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 కార్యక్రమంను విజయవంతం చేయాలని ఎంపీడీవో బాసూరి శంకరరావు కోరారు. మంగళవారం మండలంలోని అంతకాపల్లి గ్రామంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశమైన ఆయన ఇంటింటా సర్వే నిర్వహించి, అనారోగ్యంతో బాధపడే వారిని వైద్యశిబిరాలకు తరలించి, వైద్యసేవలు పొందేలా చూడాలని తెలిపారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను ఎంపీడీవో కోరారు. కార్యక్రమంలో ఈవో పీఆర్‌డీ వావిలపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ధాన్యం నూర్పిడి చేపట్టాలి

రేగిడి: రైతులు త్వరితగతిన ధాన్యం నూర్పిడి చేపట్టాలని రాజాం వ్యవసాయ శాఖ ఏడీఏ కె.చంద్రరావు సూచించారు. మంగళవారం మండలంలోని బూరాడ గ్రామ రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించిన ఆయన బూరాడ ఆర్‌బీకే ద్వారా 6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినందుకు గాను సంబంధిత అగ్రికల్చర్ అసిస్టెంట్ లోచర్ల లక్ష్మీప్రియాంకను అభినందించారు. ఇదే మాదిరిగా మిగిలిన ఆర్‌బీకేల్లోని అగ్రికల్చర్ అసిస్టెంట్లు రైతులకు అవగాహన కల్పించి, కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించేలా చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వి.జగన్మోహనరావు, సర్పంచ్ వి.శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

'రెగ్యులర్'గా పారిశుద్ధ్య పనులు

బొబ్బిలి: కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులు సమ్మెబాటపట్టిన నేపథ్యంలో రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారు. స్థానిక మున్సిపాలిటీలో 195 మంది పారిశుద్ధ్య కార్మికులకు గాను 44 మంది మాత్రమే రెగ్యులర్ కార్మికులు ఉన్నారు. మున్సిపల్ కమిషనర్ సూచనల మేరకు వీరంతా వీధుల్లోని చెత్తాచెదారాన్ని ట్రాక్టర్లలో డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. ఎవరూ వీధుల్లో చెత్త వేయవద్దని, ఇంటికి వస్తున్న కార్మికుల చేతికి అందివ్వాలని ఆయన కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 ప్రారంభం



తెర్లాంలో జరిగిన కార్యక్రమంలో మందుల కిట్లు అందిస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి



మెంటాడ: పిట్టాడలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి రాజప్పలనాయుడు

తెర్లాం: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా స్థానిక సచివాలయం–2 వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి శ్రీనివాసరావు, స్పెషలిస్టు వైద్యులు తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. అలాగే శస్త్రచికిత్స, ఎక్స్‌రే, స్కానింగ్‌ల కోసం పలువురిని జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు. శిబిరంలో రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించిన ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎంపీడీవో ఎస్.రామకృష్ణ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, తహసీల్దార్ రత్నకుమార్ పాల్గొన్నారు.

మెంటాడ: మండలంలోని పిట్టాడ గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి రెడ్డి రాజప్పలనాయుడు మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి ముంగిటకే వైద్యసేవలను ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యాసామగ్రి వితరణ

వంగర: మండలంలోని నీలయ్యవలస పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఉద్యోగి సతిపిడకల వెంకటేష్ విద్యాసామగ్రి(నోట్‌పుస్తకాలు, పెన్నులు, అట్ట(ప్లాంక్)లు) మంగళవారం వితరణ చేశారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని, తనవంతు సహాయంగా రూ.4 వేల విలువైన విద్యాసామగ్రి అందించానన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో గ్రూప్–2 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పీడీఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు రాసిన ప్రిపరేషన్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. సదస్సులో పాల్గొన్న కోచింగ్ నిపుణులు సర్వేశ్వరరావు అభ్యర్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

సరదాగా 'ఆడుదాం ఆంధ్రా'



బాడంగి: కోటిపల్లిలో ఆకులకట్ట, కోటిపల్లి జట్ల మధ్య కబడ్డీ పోటీ



బొబ్బిలి: నారసింహునిపేట జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు



బొబ్బిలి: టెన్నికాయిట్ ఆడుతున్న క్రీడాకారులు



రాజాం సిటీ: పాగిరిలో షటిల్‌బ్యాడ్మింటన్ పోటీలు

ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ అందివ్వడమే లక్ష్యంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పేరిట రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రీడాపోటీలు సరదాగా కొనసాగుతున్నాయి. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో మంగళవారం జరిగిన పోటీల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు క్రీడాకారులను ఉద్దేశించి, కాసేపు ప్రసంగించారు. యువత, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలతోనే శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. గెలుపోటములు సహజమని, ఓటమికి కుంగిపోకుండా విజయమే లక్ష్యంగా ముందుకు కొనసాగాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్.


'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'



వికసిత్ భారత్ సంకల్ప యాత్ర వాల్‌పోస్టర్ కమ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొబైల్ వాహనం ద్వారా వచ్చిన సిబ్బంది కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మండల సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి, కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని ప్రజలను కోరారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర వాల్‌పోస్టర్లు, క్యాలెండర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వామి తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర ఆధ్యాత్మిక సమన్వయకర్త ప్రసాదరావు

రేగిడి: ప్రతిఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర ఆధ్యాత్మిక సమన్వయకర్త పడాల ప్రసాదరావు అన్నారు. స్థానిక విశ్వసాయి మందిరంలో భగవాన్ శ్రీసత్యసాయి బాబా ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వచ్చే ఫలితాలు, సత్యసాయినామ సంకీర్తన, నగర సంకీర్తన వంటి విషయాలను తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.